క్లుప్తంగా

కులగణన సర్వేపై శిక్షణ



కులగణన సర్వేపై శిక్షణ ఇస్తున్న ఎంపీడీఓ, సీఆర్పీలు

కరప: మండల పరిధిలో గ్రామ వలంటీర్లు తమకు కేటాయించిన 50 కుటుంబాల వారి వివరాలతో కులగణన సర్వే నిర్దేశించిన ఫార్మాట్‌లో సకాలంలో పూర్తిచేయాలని ఎంపీడీఓ కె.అప్పారావు కోరారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం గ్రామ కార్యదర్శులు, వలంటీర్లు, సచివాలయం అసిస్టెంట్లకు కులగణన సర్వే నిర్వహణపై ఒకరోజు శిక్షణ ఇచ్చారు. సీఆర్పీలు మహ్మద్ అలీం, జి.భాస్కర్, సురేష్‌లు కులగణన సర్వేలో అనుసరించాల్సిన విధి విధానాలు, యాప్ వినియోగాన్ని వివరించారు. ఎంపీడీఓ కరప హైస్కూలు పీడీ సీహెచ్ కృష్ణతో కలసి వలంటీర్లకు ఆడుదాం ఆంధ్ర క్రీడల నిర్వహణపై అవగాహన కల్పించారు. వేళంగి, పెద్దాపురప్పాడు ఇతర హైస్కూళ్లల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ తదితర ఆటల పోటీలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ తెలిపారు.

ఆత్మీయతకు వేదికలు వన సమారాధనలు



వన సమారాధన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆదివెలమ శ్రేయోభివర్ధని సంఘ నేతలు

కాకినాడ రూరల్: ఆత్మీయతలు పంచుకుని, కష్ట సుఖాలు తెలుసుకునేందుకు ఈ నెల 26న ఆదివారం కాకినాడలో ఆదివెలమ కార్తిక సమారాధన నిర్వహిస్తున్నట్టు ఆదివెలమ శ్రేయోభివర్ధని సంఘ అధ్యక్ష, కార్యదర్శులు తిక్కాని సుబ్బారావు, మోటుపల్లి కోటేశ్వర రావు తెలిపారు. కాకినాడలో బుధవారం సంఘ నాయకులు కార్తిక సమారాధన పోస్టరు ఆవిష్కరించారు. స్థానిక అశోక్‌నగర్ బ్యాంక్ కాలనీ ఎదురుగా పైడా రామ్‌కుమార్ జమీందారు మామిడితోటలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సంఘ కోశాధికారి మోటపోతు నాగేశ్వరరావు, సభ్యులు కోకా రాజేష్, ఆదిన సత్యనారాయణ, మొగిలినీడి రాధాకృష్ణ, తిక్కాని జగన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ యాప్ ప్రారంభం



యాప్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న యూనిట్ విద్యార్థులు

కాకినాడ సిటీ: స్థానిక అన్నవరం సత్యవతీదేవి మహిళా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం జూనియర్ రెడ్‌క్రాస్ యూనిట్ కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులు రెడ్‌క్రాస్ యాప్ ప్రారంభించారు. ఈ యాప్ ద్వారా రెడ్‌క్రాస్ కార్యక్రమాలైన బ్లడ్ బ్యాంక్, బ్లడ్ గ్రూపింగ్, ఓల్డేజ్ హోం, ఆర్ఫాన్స్, తలసేమియా రోగులకు రక్తదానం, స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ తదితర సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చునని ఆ సంస్థ చైర్మన్ వైడీ రామారావు అన్నారు. ఈ యాప్‌ను కళాశాలలోని వెయ్యి మంది డౌన్లోడ్ చేసుకున్నట్లు తెలిపారు. రెడ్‌క్రాస్ కార్యదర్శి శివకుమార్, కళాశాల ప్రిన్సిపల్ సీహెచ్ఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు వెంకన్నబాబు కల్యాణం, సంబరం



పెనుగుదురులోని శ్రీ, భూ సమేత వెంకటేశ్వరస్వామి

కరప: మండలం పెనుగుదురు గ్రామంలోని శ్రీ, భూ సమేత వెంకటేశ్వరస్వామి కళ్యాణం, సంబరం గురువారం నిర్వహించేందుకు ఆలయకమిటీ ఏర్పాట్లు చేసింది. ఏటా కార్తికమాసంలో శుద్ధ ఏకాదశి రోజున రాత్రికి స్వామికి కళ్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. రాత్రి సమయంలో వీధుల్లో ఆర్కెస్ట్రా, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేసి, రాత్రి, తెల్లవార్లూ సంబరం జరుపుతారు. ఈ వేడుకలను తిలకించడానికి పెనుగుదురు, పరిసర గ్రామాల నుంచి వేలాదిగా భక్తులు తరలివస్తారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కమిటీ తెలిపింది.

నేడు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

కాకినాడ సిటీ: ఈ నెల 23న కలెక్టరేట్‌లోని విధాన గౌతమి సమావేశ మందిరంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రపై ఓరియంటేషన్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈవో ఎ.రమణారెడ్డి బుధవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంపీ వంగా గీత, ప్రజాప్రతినిధులు, కేంద్ర ప్రభుత్వ జిల్లా అధికారులు పాల్గొంటారని సీఈవో తెలిపారు.

విద్యకు తగిన ఉపాధి

- ప్రత్యేకమైన ఉద్యోగాల కోసం శిక్షణ
- ప్రతి నెలా రెండు జాబ్‌మేళాలు
- మోడల్ కెరీర్ కేంద్రంగా ఉపాధి కల్పన కార్యాలయాలు



జిల్లా ఉపాధి కార్యాలయం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పదో తరగతి ఆపై చదివిన వారు ఉపాధి కార్యాలయంలో నమోదు చేసుకుంటే అవసరాన్ని బట్టి క్రమ సంఖ్యలో సీనియారిటీ మేరకు ఉద్యోగావకాశాలకు కాల్ లెటర్లు పంపేవారు. అది కూడా ప్రభుత్వోద్యోగాలకు మాత్రమే. ఇదంతా గతం. నేడు ప్రైవేటు సంస్థలు పెరగడంతో నిపుణ్యం ఉన్నవారికి అవకాశాలు మెండుగా వస్తున్నాయి. ఉపాధి కల్పన కార్యాలయాలను కేంద్ర ప్రభుత్వం ఇటీవలే మోడల్ కెరీర్ సెంటర్ (ఎంసీసీ)గా తీర్చిదిద్ది జాబ్‌మేళాల నిర్వహణతో పాటు పలు ప్రత్యేకమైన ఉద్యోగాల కోసం శిక్షణ కూడా ఇస్తున్నారు. ఇప్పటికే ఎంసీసీలను డిజిటలైజ్ చేశారు. స్థానిక ఐటీఐ ప్రాంగణంలో ఉన్న ఉపాధి కార్యాలయంలో దీనిని ఏర్పాటు చేశారు.

ఈ కేంద్రాల ఏర్పాటులో భాగంగా కొన్ని నెలల కిందట కేంద్ర ప్రభుత్వం ఎన్‌సీఎస్ (నేషనల్ కెరియర్ సర్వీస్) పేరిట జాతీయ వెబ్‌పోర్టల్ ప్రారంభించింది. దీనిపై కళాశాలలు, పాఠశాలల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ పోర్టల్‌లో జాబ్‌సీకర్‌గా కనీస విద్యార్హత 7వ తరగతి ఆపై చదివిన వారి వివరాలు నమోదు చేస్తారు. ప్రస్తుతానికి కార్యాలయ సిబ్బంది ఆధ్వర్యంలో నమోదు ప్రక్రియ చేస్తున్నారు. విద్యార్థి స్వయంగా చేసుకోవాలంటే ఎన్‌సీసీ యూజర్ ఐడీ పాస్‌వర్డ్ క్రియేట్ చేసుకుని సమగ్ర వివరాలు అప్‌లోడ్ చేసుకోవచ్చు. ఇప్పటికే పది, ఇంటర్‌మీడియట్, డిగ్రీ, ఐటీఐ, పీజీ, ఎంబీఏ, ఎంసీఏ డిప్లమో చేసిన వారు నమోదు చేసుకున్నారు.

ప్రతి విద్యార్థికి డిజిటల్ కార్డు..

ఉపాధి కల్పనశాఖలో ఇప్పటి వరకూ వివరాలు నమోదు చేసుకున్న వారికి గుర్తింపు సంఖ్యతో పాటు ధ్రువపత్రం ఇచ్చేవారు. ఇకపై ఎంసీసీ విధానంలో వాటి స్థానంలో గవర్నమెంట్ ఆఫ్ ఇండియా పేరుతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేలా ఒక నెంబరుతో కూడిన డిజిటైజ్డ్ కార్డు జారీ చేస్తారు. దీని ద్వారా అభ్యర్థి వివరాలు ప్రతి ఏడాది సవరించుకోవాలి. ఇలా నమోదు చేసుకున్న వారి వివరాలు కేంద్రం నేరుగా పరిశీలించి అభ్యర్థి ప్రతిభ ఆధారంగా ప్రభుత్వ, ప్రైవేట్ కొలువుల మేళాలకు ఎంపిక చేస్తుంది.

ఐటీ ల్యాబ్ ఏర్పాటు..

ఎంసీసీలో దాదాపు 10 కంప్యూటర్లతో ఐటీ ల్యాబ్ ఏర్పాటు చేశారు. ఐటీ సాంకేతిక నిపుణులు విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చి సైక్రోమెటిక్ అనే పరీక్ష నిర్వహించి దీని ద్వారా వారి శక్తి సామర్థ్యాలు గుర్తించి వారికి ఏ శిక్షణ ఇవ్వాలి, ఏ విధంగా ఉపాధి కల్పించాలి లేదా స్వయం ఉపాధికి ప్రోత్సహించాలి వంటి విషయాలపై అవగాహన కల్పిస్తున్నారు. కొలువులే గాకుండా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కృషిచేస్తున్నారు.

అభ్యర్థుల నమోదు విద్యార్హతల వారీగా

పదో తరగతిలోపు వారు	468
పదో తరగతి ఉత్తీర్ణులు	5702
ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులు	6443
డిగ్రీ పట్టభద్రులు	6291
డిప్లమో ఉత్తీర్ణులు	3418
ఇతర విద్యార్హతలు గలవారు	15,592

నెలకు రెండు జాబ్‌మేళాలు..



ఉపాధి కార్యాలయాలు మోడల్ కెరీర్ సెంటర్లుగా మారాయి. ఇందులో భాగంగా నిరుద్యోగులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగ సమాచారం ఇవ్వడంతో పాటు వ్యాపార, పరిశ్రమల ఏర్పాటు వంటి వాటిపై సమాచారం ఉంటుంది. ఇప్పటికే అవగాహన కల్పించాం. కాగిత రహిత పరిపాలన దిశలో భాగంగా డిజిటల్ కార్డు అందజేస్తారు.

– జి.శ్రీనివాసరావు, జిల్లా ఉపాధి కల్పన అధికారి

కార్తిక పౌర్ణమి సభకు కలెక్టర్‌కు ఆహ్వానం



కలెక్టర్ కృతికా శుక్లాకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న పేరూరి సూరిబాబు

కాకినాడ సిటీ: విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం ప్రాంగణంలో 27న కార్తిక పౌర్ణమి సభ నిర్వహించనున్నట్టు పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు వెల్లడించారు. బుధవారం ఆయన కలెక్టర్ కృతికా శుక్లాను కలసి ఆహ్వానపత్రం అందజేశారు. అనంతరం సూరిబాబు విలేకర్లతో మాట్లాడుతు సోమవారం ఉదయం 9 గంటలకు నవమ పీఠాధిపతి ఉమర్ ఆలీషా అధ్యక్షతన సభ ప్రారంభం అవుతుందన్నారు.

స్వాధీన పట్టాల పంపిణీ



పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: స్థానిక జగన్నాథపురం 23వ డివిజన్లోని కేశన వారిదొడ్డి, వెలిశెట్టి వారి వీధి ప్రాంతాలకు చెందిన 11 మందికి ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి బుధవారం స్వాధీన పట్టాలు అందజేశారు. సుమారు 50 ఏళ్లుగా వీరంతా అక్కడే స్థిర నివాసం ఏర్పరచుకుని జీవిస్తున్నారని, బలహీనవర్గాలకు చెందిన వీరి అంశాన్ని స్థానిక మాజీ కార్పొరేటర్ మీసాల దుర్గాప్రసాద్ శ్రీదేవి ఎమ్మెల్యే ద్వారంపూడి దృష్టికి తీసుకురాగా ఆయన అధికారులతో మాట్లాడి పట్టాలు పంపిణీ చేశారు.

సంక్షేమ సారథిని మళ్లీ గెలిపించండి

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- ఆరో డివిజన్‌లో 'వై ఏపీ నీడ్స్ జగన్'



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: ప్రజా సంక్షేమం–అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని రానున్న ఎన్నికల్లో కూడా మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్థానిక 6వ డివిజన్ సచివాలయ పరిధిలో నిర్వహించిన 'వై ఏపీ నీడ్స్ జగన్'లో ఆయన లబ్ధిదారులకు అందజేసిన సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి తదితరులు హాజరయ్యారు. ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంతంగా అర్హులందరికీ నేరుగా బ్యాంకు ఖాతాల్లో సంక్షేమ పథకాల సొమ్మును జమ చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అన్నారు. ఇటువంటి ముఖ్యమంత్రిని మరోసారి గెలిపించుకుంటే పేదల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడతాయన్నారు. ఎన్నికల నేపథ్యంలో ప్రజలను మభ్యపెట్టేందుకు చంద్రబాబు, పవన్‌కల్యాణ్, కొండబాబు వంటి వ్యక్తులు వస్తున్నారని, వీరి మాయమాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. గతంలో టీడీపీ ఇచ్చిన ఏ ఒక్క వాగ్దానాన్ని అమలు చేయకుండా మేనిఫెస్టోను వెబ్‌సైట్ నుంచి తొలగించిన విషయాన్ని ప్రజలు గుర్తుచేసుకోవాలన్నారు. నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, స్థానిక నాయకులు తెలుగు రామకృష్ణ, జార్జి, సారథి, అంజిబాబు పాల్గొన్నారు.



పాతర్లగడ్డలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు, అధికారులు



పి.వెంకటాపురంలో డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరిస్తున్న అధికారులు, ఉప సర్పంచ్ సోమరాజు

సంక్షేమ పథకాల ద్వారా రూ.6.5 కోట్ల లబ్ధి

కాకినాడ రూరల్: మండలంలోని పి.వెంకటాపురంలో నవరత్న పథకాలు కింద డీబీటీ, నాన్ డీబీటీ కింద ప్రజలు రూ.6.53 కోట్లు లబ్ధిపొందారని ఉప సర్పంచ్ పెంకే సోమరాజు తెలియజేశారు. పండూరు సచివాలయం – 2 పరిధిగా పి.వెంకటాపురంలో బుధవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' నిర్వహించారు. సోమరాజు అధ్యక్షతన ఈఓ పీఆర్డీ రామాంజనేయులు, పంచాయతీ కార్యదర్శి రామ్మోహనరావు తదితరులు గ్రామసభ నిర్వహించి అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు గ్రామాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో రూ.2.5 కోట్లుతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అనంతరం పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలో వివరించారు.

సంక్షేమానికి బ్రాండ్ అంబాసిడర్ సీఎం జగన్

కరప: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా నవరత్న, సంక్షేమ పథకాలు అమలుచేస్తున్న సీఎం జగన్ దేశంలోనే సంక్షేమానికి బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచారని జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి పేర్కొన్నారు. ఆ సంక్షేమం కొనసాగాలంటే ఆయనకు ప్రజలు అండగా నిలవాలన్నారు. గ్రామాల్లో సమస్యలు గుర్తించి, నిధులు మంజూరు చేయిస్తూ, అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబును వచ్చే ఎన్నికల్లో మళ్లీ గెలిపించి, తద్వారా జగనన్నను సీఎం చేయాలన్నారు. మండలం పాతర్లగడ్డలో బుధవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' నిర్వహించి ఈ సందర్భంగా సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. నోడల అధికారి ఈఓపీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు ప్రభుత్వం అందిస్తున్న సేవలు, సంక్షేమ పథకాలను వివరించారు. సర్పంచ్ నాగిరెడ్డి ఏసుబాబు మాట్లాడుతూ పాతర్లగడ్డలో రూ.8.47 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అనంతరం గ్రామ కూడలిలో వైఎస్సార్ సీపీ పతాకాన్ని నాయకులు ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, ఉప సర్పంచ్ పి.నారాయణమూర్తి, పార్టీ నాయకులు పెంకే సత్తిబాబు, మద్దుల అప్పారావు, ఎ.గంగరాజు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి రథయాత్ర



కరపలో అయ్యప్పస్వామి రథోత్సవాన్ని నిర్వహిస్తున్న స్వాములు

కరప: గ్రామంలో బుధవారం రాత్రి అయ్యప్పస్వాములు భక్తి, శ్రద్ధలతో అయ్యప్పస్వామి రథయాత్ర నిర్వహించారు. ముద్రగడ నానాజీ, పాట్నీడి భీమేశ్వరరావు, గొర్రెల శ్రీనివాస్ స్వాములు రథానికి 18 మెట్లు ఏర్పాటుచేసి అలంకరించారు. అందులో అయ్యప్పస్వామి కంచువిగ్రహాన్ని ఉంచి లక్ష్మీనారాయణ గురుస్వామి, నానాజీ, భీమేశ్వరరావు తదితర స్వాములు ప్రత్యేకపూజలు చేశారు.

వైఎస్సార్ సీపీలోకి ఐటీ ఉద్యోగుల చేరిక



ఐటీ ఉద్యోగులతో ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: కాకినాడకు చెందిన సుమారు 50 మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు బుధవారం ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. డ్రీమ్ వే సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ అధినేత కె.రాజేష్‌శర్మ ఆధ్వర్యంలో వారు ఆ పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపించగా ఎమ్మెల్యే ద్వారంపూడి కండువాలు కప్పి ఆహ్వానించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ విధానాలకు ఆకర్షితులమై పార్టీలో చేరామన్నారు. సోషల్ మీడియా ద్వారా పార్టీ అభ్యున్నతికి తమ వంతు కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ విద్యావంతులైన ఐటీ ఉద్యోగులు పార్టీలో చేరేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం సోషల్ మీడియా కీలక పాత్ర పోషిస్తోందని, పార్టీలో చేరిన ఐటీ ఉద్యోగులు సోషల్ మీడియా ద్వారా కీలకపాత్ర వహించాలని సూచించారు. జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, పార్టీ నాయకులు రాగిరెడ్డి సుబ్బారావు, అబ్దుల్ బషీరుద్దీన్, గూటాల రామకృష్ణ, మీసాల దుర్గాప్రసాద్, బీర కృష్ణప్రియ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల పంపిణీ

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ ఆధ్వర్యంలో బుధవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షురాలు ఎం.ప్రసూన, శ్రీదేవిరెడ్డి, శ్రీవాణి, అడబాల రత్నప్రసాద్, రాఘవరావు, రెడ్నం రాజా తదితరులు పాల్గొన్నారు.

చిల్డ్రన్స్ హోమ్‌కు..

బోట్‌క్లబ్: చదువుకునే వయసు నుంచే సేవా దృక్పథం అలవాటు చేసుకోవడం గొప్ప విషయమని రెయిన్ బో చిల్డ్రన్స్ హోమ్ నిర్వాహకుడు లక్ష్మీ నాగేంద్ర అన్నారు. స్థానిక రామారావుపేటలోని గుంటూరు ఆక్స్‌ఫర్డ్ స్కూల్ చిన్నారులు బుధవారం జగన్నాథపురంలోని చిల్డ్రన్ హోమ్‌కు నిత్యావసర వస్తువులు అందించారు. స్కూల్ ప్రిన్సిపాల్ తోట వేణి, ఉపాధ్యాయిని తోట ఉమారాణి పాల్గొన్నారు.

గ్రేడ్–1 కమిషనర్‌గా ఏసుబాబు

- అభినందించిన కమిషనర్, వివిధ విభాగాల అధిపతులు



ఏసుబాబును సత్కరిస్తున్న కమిషనర్ నాగ నరసింహారావు వివిధ విభాగాధిపతులు

కాకినాడ: గ్రేడ్–1 కమిషనర్‌గా పదోన్నతి పొందిన నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం. ఏసుబాబును కార్పొరేషన్ అధికారులు బుధవారం సత్కరించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు అధ్యక్షతన వివిధ విభాగాల అధిపతులు ఆయనను సత్కరించారు. కమిషనర్ నాగ నరసింహారావు మాట్లాడుతూ సమర్థవంతమైన సేవలతో గుమస్తా నుంచి అంచలంచెలుగా గ్రేడ్–1 కమిషనర్‌గా పదోన్నతి పొందిన ఏసుబాబు భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఏసుబాబు మాట్లాడుతూ అందరి సహకారాలతో సమర్థవంతంగా విధులు నిర్వర్తించగలిగానని, పదోన్నతితో ఇక్కడే పని చేసే అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. కార్పొరేషన్ మేనేజర్ కర్రి సత్యనారాయణ, లీగల్ అడ్వైజర్ డీవీఎస్ఎన్ మూర్తి, ఎస్ఈ పి.సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, ఏసీపీ నాగశాస్త్రులు, ఈఈలు వెంకటరావు, మాధవి, ఏవో శిరీష్ తదితరులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డల ఆరోగ్యమే లక్ష్యం

- షెడ్యూల్ ప్రకారం అందించాల్సిన వైద్యంపై ఆస్పత్రుల్లో ఎంసీపీ కార్డులు
- వైద్య, ఆరోగ్యశాఖలో నూతన విధానాలకు నాంది పలికిన ప్రభుత్వం



గర్భిణులకు ప్రభుత్వం జారీ చేసిన ఎంసీపీ కార్డు



ఆర్‌బీ కొత్తూరులో శిశువుకు టీకా వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

పెద్దాపురం: మాతా, శిశు మరణాలు నివారణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వైద్య, ఆరోగ్య శాఖలో సమూల మార్పులకు నాంది పలికింది. అన్ని పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా ఆసుపత్రుల్లో పూర్తి స్థాయిలో సిబ్బంది నియామకంతో పాటు నిర్ణీత సమయాల్లో టీకాలు వేయడం, మందుల కొరత లేకుండా చర్యలు, సుఖ ప్రసవాలకు చర్యలు చేపట్టింది. గర్భం దాల్చినప్పటి నుంచి బిడ్డ పుట్టేవరకు తదనంతరం బాలింతగా, బిడ్డ సంరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలతో కూడిన ఎంసీపీ కార్డులను ముద్రించింది. ఆ షెడ్యూల్ ప్రకారం చర్యలు తీసుకునేలా పీహెచ్‌సీలలో క్షేత్రస్థాయి సిబ్బందికి వాటిని అందజేసింది. అలాగే ప్రధాన మంత్రి మాతృత్వ సురక్ష యోజన, జననీ సురక్ష యోజన, ప్రధాని మాతృత్వ వందన యోజన, ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగిన ప్రసవానికి ఆర్థిక సాయం వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోంది.

శిశువులకు టీకాలే శ్రీరామ రక్ష..

అప్పుడే జన్మించిన శిశువు నుంచి ఐదేళ్ల లోపు చిన్నారుల వరకూ సాధారణంగా వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. దీంతో చిన్నారుల ఇన్‌ఫెక్షన్‌సోకి అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉంది. నిర్ణీత సమయంలో టీకాలు వేసేలా ఎంసీపీ కార్డుల్లో షెడ్యూల్ రూపొందించారు. ఏదైనా ఇబ్బంది వచ్చి నిర్ణీత తేదీ నాడు టీకా వేయకుంటే ఆరోగ్య సిబ్బందే ముందస్తు సమాచారం ఇచ్చి బిడ్డకు టీకా వేస్తారు.



అవగాహన పెంచుతున్నాం

రాష్ట్ర ప్రభుత్వం చిన్నారులు, గర్భిణుల ఆరోగ్య రక్షణ కోసం ప్రవేశపెట్టిన ఎంసీపీ కార్డులు సద్వినియోగం చేసుకోవడంపై వారికి అవగాహన కల్పిస్తున్నాం. ఎంసీపీ కార్డు ద్వారా గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం జరిగే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, శిశువుకు సకాలంలో అందించాల్సిన టీకాలపై తల్లులకు వివరిస్తున్నాం.

– ఎం.ఉషా ప్రియదర్శిని, కాండ్రకోట పీహెచ్‌సీ వైద్యాధికారి, పెద్దాపురం మండలం

ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం

బోట్‌క్లబ్: భారత రాజ్యాంగాన్ని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నవంబర్ 26న నిర్మించారని బీజేపీ జిల్లా అధ్యక్షులు చిలుకూరి రామ్‌కుమార్ అన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2015 నుంచి భారత రాజ్యాంగ నిర్మాణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ఈ నెల 22 నుంచి డిసెంబర్ 6 వరకూ బీజేపీ ఆధ్వర్యంలో ప్రతి ఎస్సీ వాడలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జగన్నాథపురంలోని అంబేడ్కర్ విగ్రహానికి బుధవారం పూలమాలలు వేసి స్వీట్లు పంచారు. బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఏడిద కృష్ణ, చక్కా రమేష్, వాసంశెట్టి శ్రీనివాస్, కె గంగరాజు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'తో అందుబాటులో వైద్యం

కాకినాడ రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలకు వారి సచివాలయాల పరిధిలో వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని డీఎల్‌డీఓ, రమణయ్యపేట గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి పాటంశెట్టి నారాయణరావు పేర్కొన్నారు. రాయుడుపాలెంలో రమణయ్యపేట సచివాలయం–2 వద్ద బుధవారం పండూరు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పర్యవేక్షణలో జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహించారు. శిబిరంలో పండూరు పీహెచ్‌సీ వైద్యాధికారి మాధవీలత, స్పెషలిస్టు వైద్యులు బీపీ, సుగర్ పరీక్షలు మొదలుకొని కంటి పరీక్షల వరకు వైద్య సేవలందించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు లింగం రవి, వరప్రసాద్, గిరీష్, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో వైద్య సేవలను పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ నారాయణమూర్తి, లింగం రవి తదితరులు